సాక్షి
అనంతపురం
శుక్రవారం ၊ 21 ၊ జూలై ၊ 2023



టన్ను చీనీ రూ.19 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి. మార్కెట్‌కు 651 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



గుండెకు సూపర్ చికిత్స
అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక సేవలు అందుతున్నాయి. కార్డియాలజీ విభాగం రోగులకు వరంలా మారింది. 8లో

గరిష్టం/కనిష్టం
31.2°/22.4°
జిల్లా అంతటా గురువారం తుపాను వాతావరణం నెలకొంది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా మోస్తరు వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంలో 12 టీఎంసీల నీరు


తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో 12.574 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు టీబీ బోర్డు అధికారులు గురువారం వెల్లడించారు. డ్యాంలో 1,633 అడుగుల నీటి మట్టానికి 1,591.77 అడుగులకు చేరింది. డ్యాం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు. ప్రస్తుతం 12.574 టీఎంసీల నీరు ఉంది. ఇన్‌ఫ్లో 9,536 క్యూసెక్కులు కాగా, అవుట్‌ఫ్లో 245 క్యూసెక్కులుగా ఉంది. గతేడాది ఇదే సమయానికి 1,631.53 అడుగులతో 99.937 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,48,159 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1,28,247 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉండింది.

విద్యాశాఖ ఏడీ-2గా నాగరాజు


ఏడీ నాగరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏడీ-1 కృష్ణయ్య

రాప్తాడురూరల్: జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్-2గా వి.నాగరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు డీవీఈఓగా పని చేస్తున్న ఆయనను ఏడీ-2గా ప్రభుత్వం నియమించింది. ముందుగా ఆయన జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్‌ను కలిసి రిపోర్ట్ చేసుకున్నారు. అనంతరం తన చాంబరులో బాధ్యతలు స్వీకరించారు. ఏడీ-1 కృష్ణయ్య, సూపరింటెండెంట్లు శ్రీనాథ్, ఆదినారాయణ, సరళ కుమారి, సిబ్బంది పార్థసారథి, అనిల్, వంశీ పుష్పగుచ్ఛం అందజేశారు. కర్నూలు జిల్లాకు చెందిన నాగరాజు 1987లో సర్వీస్ కమిషన్ ద్వారా జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికై ఉద్యోగ జీవితం ప్రారంభించారు. 1999లో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. 2010లో సూపరింటెండెంట్‌గా, 2019లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు.

గుంతకల్లు డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడుపుదాం

- నూతన డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్



వెంకటరమణా రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్

గుంతకల్లు: గుంతకల్లు డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఉద్యోగులు సహకరించాలని నూతన డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ కోరారు. గురువారం నూతన డీఆర్‌ఎం అగర్వాల్ ప్రస్తుత డీఆర్‌ఎం వెంకటరమణారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. గుంతకల్లు డివిజన్ స్థితిగతులు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అంతకుముందు నూతన డీఆర్‌ఎం అగర్వాల్‌ను ఏడీఆర్‌ఎం సూర్యనారాయణ, ఇతర అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

గడువులోగా ఈకేవైసీ పూర్తి

అనంతపురం అర్బన్: గడువులోగా పీఎం కిసాన్ ఈకేవైసీ పూర్తి చేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. గురువారం అమరావతి నుంచి కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుంచి సమావేశంలో పాల్గొన్నారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద రీ-సర్వే వేగవంతం చేశామన్నారు. ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్, సచివాలయాలు, తదితర భవనాల నిర్మాణ పనుల పురోగతిపై రోజువారీ సమీక్షిస్తున్నామని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జేడీఏ ఉమా మహేశ్వరమ్మ, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చిరుజల్లులతో సరి!

చిరుజల్లులతోనే వరుణుడు చాలించుకుంటున్నాడు. పంటలు వేసేందుకు అవసరమైన పదునైన వర్షం మాత్రం పడడం లేదు. రోజూ మబ్బులు దోబూచులాడుతున్నా మంచి వర్షం ఇప్పటివరకూ నమోదు కాలేదు. దీంతో వరుణ దేవుడి కరుణ కోసం రైతన్నలు ఎదురు చూస్తున్నారు. జోరుగా వర్షం పడితే విత్తనం వేసేందుకు సిద్ధంగా ఉన్నారు.


సేద్యం పనులు చేసుకుంటున్న రైతులు

పదునైన వాన కురవాలి !
- 16 మండలాల్లో 20 శాతం కంటే తక్కువ వర్షపాతం
- శింగనమల, బీకేఎస్ మండలాల్లో మాత్రమే అధికంగా
- జోరువాన కోసం రైతన్నల ఎదురుచూపు
- నెలాఖరులో మంచి వర్షాలు పడొచ్చని అంచనా

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో ప్రధానంగా వేరుశనగ, ఆముదం, కంది పంటలు వేస్తారు. గతేడాది జూన్, జూలై నాటికి 90 శాతం మండలాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది మాత్రం ఇప్పటివరకూ ఆశించిన మేర వర్షాలు కురవలేదు. మెట్టపంటలు వేసే రైతులు సేద్యం పనులు చేసుకుని సిద్ధంగా ఉన్నారు. పదునయ్యే ఒక్క వర్షం పడితే వేలాది ఎకరాల్లో విత్తు పడనుంది. నైరుతి రుతుపవనాల్లో భాగంగా జూలై చివరి వారంలో లేదా ఆగస్టులో మంచి వర్షాలు పడే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.

రెండు మండలాల్లోనే ఎక్కువ..
జిల్లాలో 31 మండలాలుండగా బుక్కరాయ సముద్రం, శింగనమల మండలాల్లో మాత్రమే సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. బీకేఎస్‌లో సాధారణ వర్షపాతం 73.3 మి.మీ కాగా, 115.9 మి.మీ వర్షపాతం నమోదైంది. శింగనమల మండలంలో సాధారణ వర్షపాతం 88.5కు, 117.4 శాతం నమోదైంది. బీకేఎస్‌లో 58.1, శింగనమల మండలంలో 32.7 మి.మీ అధిక వర్షపాతం నమోదైంది. బొమ్మనహాళ్, విడపనకల్లు, కళ్యాణదుర్గం మండలాల్లో సాధారణం కంటే 60 శాతం తక్కువగా నమోదైంది. కంబదూరు, రాప్తాడు, నార్పల, గార్లదిన్నె, గుమ్మఘట్ట, బెళుగుప్ప, పామిడి, పెద్దపప్పూరు, రాయదుర్గం మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

భూగర్భ జలాలకు ఢోకా లేదు!
ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షాలు పడటంలో జాప్యం జరిగినా భూగర్భజలాలకు ఢోకా లేదు. గడిచిన నాలుగేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురవడంతో భారీగా భూగర్భ జలాలు పెరిగాయి. దాదాపు ఇరవై ఏళ్ల ఎండిపోయిన బోర్లు, బావుల్లో కూడా కావాల్సినన్ని నీళ్లు వచ్చాయి. జిల్లాలో ఎక్కువ శాతం ఉద్యాన పంటలు వేస్తారు కాబట్టి వరుణుడు జాప్యం చేసినా ఇబ్బంది లేదు. దీనికి తోడు 9 గంటల పాటు పగలే కరెంటు ఉన్న పరిస్థితుల్లో జిల్లాలో ఎక్కడా పండ్ల తోటలకు ఢోకాలేదు. జిల్లా వ్యాప్తంగా 301 చెరువులు ఉండగా ఇప్పటికీ 91 చెరువుల్లో నీళ్లున్నాయి. భూగర్భ జలాలు పుష్కలంగా ఉండటంతో బోర్లు వేసుకునేందుకు వాల్టా చట్టం కింద ఉండే నిషేధం కూడా ఎత్తేశారు.

ఈ ఏడాది జూన్, జూలైలో వర్షపాతం ఇలా

కేటగిరీ	మండలాలు
జిల్లాలో మొత్తం	31
సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదు	02
సాధారణ వర్షపాతం	10
20 శాతం తక్కువగా వర్షపాతం నమోదు	16
60 శాతం కంటే తక్కువ వర్షపాతం నమోదు	03

వారం, పది రోజుల్లో మంచి వర్షాలు



జిల్లాలో జూన్‌లో 61 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 46 మి.మీ. మాత్రమే నమోదైంది. జూలైలో 43 మి.మీకు గానూ 38 మి.మీ మాత్రమే నమోదైంది. 27 మి.మీ లోటు వర్షపాతం ఉంది. నైరుతి రుతుపవనాలు మన రాష్ట్రంలోకి రావడానికి 7 రోజుల ఆలస్యమైంది. ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వారం, 10 రోజుల్లో మంచి వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.
– డాక్టర్ అశోక్‌కుమార్, సీనియర్ శాస్త్రవేత్త, రేకులకుంట వ్యవసాయ వాతావరణ విభాగం

జిల్లాకు వర్షసూచన

- రాగల రెండు రోజులూ వానలు కురిసే అవకాశం



అనంతపురం అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే.అశోక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం వారు వాతావరణ బులెటిన్ విడుదల చేశారు.

పలు చోట్ల వాన..
జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం పడింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు 26 మండలాల పరిధిలో 4.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. రాయదుర్గం 12.4 మి.మీ, డి.హిరేహాళ్ 12 మి.మీ, గుంతకల్లు, విడపనకల్లు 10 మి.మీతో పాటు శింగనమల, బెళుగుప్ప, ఆత్మకూరు, గార్లదిన్నె, గుత్తి, ఉరవకొండ, పెద్దవడుగూరు, అనంతపురం, బుక్కరాయసముద్రం, గుమ్మగట్ట, వజ్రకరూరు, రాప్తాడు తదితర మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. జూలై నెల సాధారణ వర్షపాతం 63.9 మి.మీ కాగా. ఇప్పటికి 30 మి.మీ నమోదైంది. జిల్లావ్యాప్తంగా గత జూన్ 1 నుంచి ఇప్పటి వరకూ 12 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదయ్యాయి. ఆగస్టు 3 వరకూ ప్రధాన పంటల సాగుకు అనుకూలమని శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని సూచించారు.

నేటి నుంచి సెలవులో జేసీ కేతన్‌గార్గ్



అనంతపురం అర్బన్: జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ శుక్రవారం నుంచి 15 రోజుల పాటు సెలవులో వెళ్లనున్నారు. వ్యక్తిగత పనులపై ఆయన సెలవు తీసుకున్నారు. తిరిగి ఆగస్టు 5న విధులకు హాజరవుతారు. అప్పటి వరకు జాయింట్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలను డీఆర్‌ఓ గాయత్రిదేవికి అప్పగించారు.

ఈవెంట్స్‌కు ఉచిత శిక్షణ

- ఎస్‌ఐ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల కోసం శ్రీకారం
- రేపు పోలీసు పరేడ్ మైదానంలో ప్రారంభించనున్న ఎస్పీ



అనంతపురం శ్రీకంఠం సర్కిల్: ఎస్‌ఐ ప్రిలిమినరీలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈవెంట్స్‌కు శిక్షణ ఇచ్చేందుకు జిల్లా పోలీసు శాఖ శ్రీకారం చుడుతోంది. ఎస్పీ కె. శ్రీనివాసరావు శనివారం స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. 1,600, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, తదితర ఫిజికల్ ఈవెంట్స్‌పై ఉదయం, సాయంత్రం సుశిక్షితులైన సిబ్బంది తర్ఫీదు ఇవ్వనున్నారు.

నేడు ప్రత్యేక ‘స్పందన’

అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు ఉద్యోగుల కోసం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. ఉద్యోగులు తమ సమస్యలను అర్జీ రూపంలో సమర్పించాలని సూచించారు. ఇక నుంచి ప్రతి నెలా మూడో శుక్రవారం ‘ప్రత్యేక స్పందన’ నిర్వహిస్తామని తెలియజేశారు.

నేటి నుంచి ఓటరు జాబితా సవరణ

- మార్పులు, చేర్పులు, కొత్త ఓటరుగా నమోదుకు అవకాశం
- ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించనున్న బీఎల్‌ఓలు


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో డీఆర్‌ఓ గాయత్రి దేవి

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2024 కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. నెల రోజులపాటు ఆగస్టు 21 వరకూ కొనసాగుతుంది. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, కొత్తగా ఓటు నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఆగస్టు 22వ తేదీ నుంచి సెప్టెంబరు 29వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, జాబితా సవరణకు సంబంధించిన పనులు చేపడతారు. సెప్టెంబరు 30వ తేదీ నుంచి అక్టోబరు 16 వరకూ ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ నిర్వహిస్తారు. 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తారు. ఓటరు జాబితా సవరణపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను అక్టోబరు 17 నుంచి నవంబరు 30వ వరకూ స్వీకరిస్తారు. డిసెంబరు 26 నాటికి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు పరిష్కరిస్తారు. 2024, జనవరి 1 నాటికి ఓటర్ల జాబితా సిద్ధం చేస్తారు. 2024, జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తారు. ఈ ఏడాది జనవరి 5వ తేదీన ఎన్నికల సంఘం ప్రకటించిన ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 19,39,163 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 9,67,841 మంది, మహిళ ఓటర్లు 9,71,098 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 224 మంది ఉన్నారు.

ఇంటింటికీ బీఎల్‌ఓలు..
ఓటరు జాబితా సవరణలో భాగంగా బీఎల్‌ఓ (బూత్ లెవల్ అధికారి)లు ఇంటింటికీ వెళ్లనున్నారు. ఓటరు వివరాలు సేకరించి సంబంధిత ఫారాల ద్వారా చేర్పులు, మార్పులు చేపట్టనున్నారు. ఇప్పటికే అధికారులు బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు.

ప్రస్తుతం జిల్లాలో ఓటర్లు ఇలా...

మొత్తం ఓటర్లు	19,39,163
పురుషులు	9,67,841
మహిళలు	9,71,098
థర్డ్ జెండర్	224

రాజకీయ పార్టీలు సహకరించాలి
జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2024కు సహకరించాలని కలెక్టర్ ఎమ్.గౌతమి రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో డీఆర్‌ఓ గాయత్రిదేవితో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో గ్రామ, వార్డు వలంటీర్లు పాల్గొనకూడదని చెప్పారు. తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించే లక్ష్యంగా సవరణ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారిని ఓటరుగా చేర్పించాలని సూచించారు. బీఎల్‌ఓలకు సహకారం అందించాలని చెప్పారు. అనంతరం పాత ఆర్‌డీఓ కార్యాలయం ఆవరణలో ఈవీఎంలు భద్రపరిచిన గోదామును కలెక్టర్ సందర్శించారు. ఈవీఎంల భద్రతపై ఆరా తీశారు. వర్షపు నీరు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ మధుసూదన్, తహసీల్దారు శ్రీధర్ మూర్తి, ఎన్నికల డీటీలు కనకరాజు, దివాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక రాయితీలు


మాట్లాడుతున్న ఏడీ రాజశేఖర్‌రెడ్డి

అనంతపురం టౌన్: పరిశ్రమలను నెలకొల్పేందుకు ముందుకు వచ్చే యువ పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పిస్తోందని పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయంలో గురువారం మాజీ సైనికులకు స్వయం ఉపాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు కోసం ఏపీఐఐసీ, పరిశ్రమల శాఖ సంయుక్తంగా స్థలాలు కేటాయిస్తోందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేసిందన్నారు. రాప్తాడు మండల పరిధిలో జాతీయ రహదారి పక్కనే 150 ఎకరాల విస్తీర్ణంలో ఏపీఐఐసీ పార్కుతో పాటు కూడేరు మండల కేంద్రంలో 400 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ప్రత్యేక ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం స్థలాలను రిజర్వు చేసిందన్నారు. పరిశ్రమల యూనిట్లతో పాటు సేవా రంగ పరిశ్రమలకు సైతం ప్రభుత్వం విద్యుత్ రాయితీతో పాటు పెట్టుబడి రాయితీ అందిస్తోందన్నారు. పీఎంఈజీపీ, జగనన్న బడుగు వికాసం తదితర పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం సత్యరాజ్, మాజీ సైనికుల సంఘం నాయకులు విశ్వేశ్వరావు, సుదర్శన్ రెడ్డి, రమేష్ రెడ్డి, శ్రీనివాసులు, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఒకరికివ్వాల్సిన ప్రమోషన్ మరొకరికి!

- సీనియర్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ వేటు

రాప్తాడురూరల్: పదోన్నతుల జాబితాలో సిబ్బంది మతలబు చేశారు. సీనియర్ టీచర్ పేరును జాబితాలో చేర్చకుండా జూనియర్‌కు పదోన్నతి కల్పించారు. సీనియర్ అడ్డు చెప్పడంతో రాత్రికి రాత్రి ఆమెకు మార్చారు. ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించిన డీఈఓ సాయిరాం సీనియర్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలిలా.. ఎస్‌ఏ (గణితం) పదోన్నతుల కౌన్సెలింగ్ ఈనెల 6న జరిగింది. సీనియార్టీ జాబితాలో తనకల్లు మండలంలో పనిచేస్తున్న ప్రభావతి పేరు లేదు. ఆ తర్వాత ఉన్న బి.సురేఖ కౌన్సెలింగ్‌కు హాజరై ప్రమోషన్ తీసుకుని విరుపాపల్లి ఎంపీయూపీఎస్ కోరుకున్నారు. సంతకం చేసి వెళ్లిపోయారు. అయితే, సాయంత్రం 6.30 గంటల సమయంలో ప్రభావతి డీఈఓ కార్యాలయ సిబ్బంది వద్దకు వచ్చి, తనపేరు లేకుండా జూనియర్ పేరును ఎలా చేర్చారని ప్రశ్నించారు. దీంతో సురేఖకు ఫోన్ చేసి ప్రమోషన్ రద్దు చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ఆ తర్వాత ప్రభావతికి ఇచ్చి పంపారు. విషయం డీఈఓకు తెలియకుండా జాగ్రత్త పడ్డారు. తర్వాత రోజు డీఈఓను కలిసిన సురేఖ.. సీనియార్టీ జాబితాలో పేరులేని, కౌన్సెలింగ్‌కు హాజరుకాని టీచరుకు ఎలా ప్రమోషన్ ఇస్తారని వాపోయారు. వాస్తవంగా సీనియర్‌గా ఉన్న వారికే ప్రమోషన్ ఇవ్వాల్సి ఉంటుందని డీఈఓ చెప్పారు. సీనియార్టీ జాబితా తయారు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శించినట్లు గుర్తించి సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ మూడు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు.


టమాట పంపిణీ చేస్తున్న దృశ్యం


రైతు బజార్‌లో రాయితీ టమాటా కోసం బారులు తీరిన ప్రజలు

టమాట.. కిటకిట!

- రాయితీ టమాట విక్రయాలకు విశేష స్పందన
- నేడు సెలవు, రేపు యథావిధిగా అమ్మకాలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన రాయితీ టమాట విక్రయ కేంద్రానికి విశేష స్పందన లభిస్తోంది. కిలో రూ.50 ప్రకారం విక్రయిస్తుండడంతో జనం పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. దీంతో రైతు బజార్ పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. వినియోగదారులపై భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతుబజార్‌లో రాయితీ కౌంటర్ ఏర్పాటు చేయడంపై పలువురు సంతోషం వ్యక్తం చేశారు. కాగా, బుధవారం తొలిరోజు ఒకటిన్నర టన్ను, గురువారం మరో ఒకటిన్నర టన్ను టమాట అమ్మకాలు జరిగినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ పి.సత్యనారాయణ చౌదరి, ఎస్టేట్ అధికారి ప్రతాప్ రుద్ర తెలిపారు. దేశవ్యాప్తంగా టమాట సాగు, దిగుబడులు తగ్గిపోవడంతో ధరలు పెరిగినట్లు పేర్కొన్నారు. వర్షాలు పడుతుండటం, రవాణాకు అంతరాయంతో పాటు స్థానిక మండీకి కూడా సరుకు తక్కువగా వస్తున్నందున శుక్రవారం రైతుబజార్‌లో కౌంటర్‌కు సెలవు ఉంటుందన్నారు. శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు టమాట అమ్మకాలు ఉంటాయని తెలిపారు.

మైనర్లకు యాసిడ్ అమ్మొద్దు

- ఎస్పీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎస్పీ


హాజరైన అధికారులు

అనంతపురం శ్రీ కంఠం సర్కిల్: మైనర్లకు యాసిడ్ విక్రయించరాదని ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. బంగారుదుకాణదారులు, లేబొరేటరీలు కలిగిన కళాశాలల ప్రతినిధులు, యాసిడ్ విక్రయ దుకాణదారులతో గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికలపై యాసిడ్ దాడులను అరికట్టడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్న పోలీసు శాఖకు సహకరించాలన్నారు. యాసిడ్ విక్రయాలు జరపాలంటే తప్పనిసరిగా కలెక్టర్ నుంచి లైసెన్స్ పొంది ఉండాలన్నారు. జీఎస్టీ తప్పనిసరి అన్నారు. క్రయ, విక్రయాలకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. 15 రోజులకోసారి యాసిడ్ నిల్వలు, విక్రయాల వివరాలు సమర్పించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే రూ.50 వేలు జరిమానా విధిస్తారన్నారు. కొనడానికి వచ్చిన వారి ఆధార్, అడ్రస్ పక్కాగా తీసుకోవాలని సూచించారు. యాసిడ్ నిల్వ ఉంచే ప్రాంతంలో భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. సమావేశంలో అనంతపురం రూరల్ డీఎస్పీ బీవీ శివారెడ్డి, డీసీఆర్బీ సీఐ విశ్వనాథ చౌదరి తదితరులున్నారు.

పవన్‌పై పరువు నష్టం దావా సరైనదే

• మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



కళ్యాణదుర్గం: వలంటీర్లను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌పై పరువు నష్టం దావా వేయడం సరైందేనని మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. గురువారం సాయంత్రం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. దురుద్దేశ పూర్వకంగా వలంటీర్ వ్యవస్థను కించపరిచేలా పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఈ అంశంలో పవన్‌కళ్యాణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం జీఓ నంబర్ 16ను విడుదల చేయడం సరైందన్నారు. ఏపీలో ఎన్‌సీఆర్‌బీ డేటా ప్రకారం 29 వేల మంది మహిళలు తప్పిపోవడానికి కారణం వైఎస్సార్‌సీపీనే అని పవన్ వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని సమాచారాన్ని సేకరిస్తున్నారని చెప్పడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఒంటరి మహిళలను గుర్తించి, వారి జీవనానికి పింఛన్లు అందజేసే ప్రభుత్వ చర్యల్లో భాగంగా వలంటీర్లు వివరాలు సేకరిస్తున్నారన్నారు. ప్యాకేజీలకు, పొత్తులకు పాకులాడకుండా వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన రాష్ట్రాభివృద్ధిని, మెరుగు పడిన ప్రజల జీవన ప్రమాణాలను చూసి మాట్లాడాలని హితవు పలికారు.

గుండెకు సూపర్ చికిత్స

• ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కార్డియాలజీ అద్భుత సేవలు
• అందుబాటులో రూ.కోట్లు విలువ చేసే పరికరాలు
• ప్రాణాపాయ కేసులు విజయవంతం చేస్తున్న వైద్యులు
• రూ.లక్షలతో కూడుకున్న శస్త్రచికిత్సలు పూర్తిగా ఉచితం

అనంతపురం క్రైం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వైద్య రంగంలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వాస్పత్రులను పటిష్టం చేస్తూ పేదలు, మధ్య తరగతి ప్రజారోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారు. ఈ క్రమంలోనే అనంతపురం కేంద్రంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో అత్యాధునిక వైద్య సేవలను చేరువ చేస్తూ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రాణాపాయ స్థితిలో ఈ ఆస్పత్రి మెట్లు ఎక్కిన రోగి కొన్ని రోజుల వ్యవధిలోనే సంపూర్ణంగా కోలుకుని ఎంతో సంతోషంగా ఇంటి బాట పడుతుండడం గమనార్హం.

కార్డియాలజీలో విస్తృత సేవలు

ఉమ్మడి జిల్లాలో మరే ఆస్పత్రిలోనూ లేని విధంగా ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని కార్డియాలజీ విభాగానికి అత్యాధునిక పరికరాలను ప్రభుత్వం సమకూర్చింది. సూపర్ స్పెషాలిటీలో గతేడాది ఏప్రిల్‌లో ఓపీ, అదే ఏడాది జూన్‌లో ఐపీ సేవలు మొదలయ్యాయి. రూ.లక్షలతో కూడుకున్న ఖరీదైన శస్త్రచికిత్సలు ప్రజలకు ఉచితంగా అందజేసేలా గత ఏడాది డిసెంబర్ 21న క్యాథ్‌ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇందు కోసం రూ.6.5 కోట్లను ప్రభుత్వం వెచ్చించింది. అలాగే రూ.2 కోట్ల వ్యయంతో అత్యున్నత ప్రమాణాలతో కూడిన పది పడకల ఐసీయూ, 20 పడకల ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ సుభాష్‌చంద్రబోస్ నేతృత్వంలో ఇప్పటి వరకూ 300లకు పైగా ఆంజియోప్లాస్టీ, యాంజోగ్రామ్ తదితర శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. ఇందులో 70 మందికి ఆంజియోప్లాస్టీ చేసి 94 స్టంట్లు వేశారు. ఈ తరహా శస్త్రచికిత్సకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు అంటున్నారు. వీటితో పాటు 250 వరకూ ఆంజియోగ్రామ్ ప్రక్రియలు జరిగాయి. రూ.1.2 కోట్ల విలువ చేసే వీవీడ్‌ఈ95 2డీ ఎకో పరికరం అందుబాటులోకి తీసుకురావడంతో ఇప్పటి వరకూ 9వేల మందికి ఎకో పరీక్షలు చేశారు. ప్రైవేట్‌గా ఒక్క 2డీ ఎకో పరీక్ష చేయాలంటే రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తారు. గుండె పోటుకు గురైనప్పుడు గుండెలోని రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టే పరిస్థితులుంటాయి. అప్పుడు థ్రాంబొలైసిస్ వంటి థెరపీ చేయాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి ఒక్క వైల్ రూ.40వేలు విలువ చేసే ఎలాక్సియమ్ అనే ఇంజెక్షన్ అందుబాటులో ఉంచారు. ఇలాంటి థెరపీలు ఇప్పటి వరకూ వందకు పైగా వైద్యులు చేశారు. అలాగే తాత్కాలిక పేస్‌మేకర్, పెరికార్డియోసెంటిసిస్ (గుండె చుట్టూ నీరు చేరడం) సేవలూ అందుబాటులో ఉన్నాయి. బీపీ తక్కువగా ఉండి చెమటలు పట్టడం, కళ్లు తిరగడం, తదితర సమస్యతో ఉన్న వారికి సేవలందించేందుకు రూ.30 లక్షలు విలువ చేసే ఇంట్రా అయోర్టిక్ బలూన్‌పంప్ అందుబాటులో ఉంది.



ఈ వృద్ధురాలి పేరు బయమ్మ. శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం సామచేనుబయలు గ్రామం. గుండె సంబంధిత సమస్యతో ఇబ్బంది పడుతున్న ఆమెను ఈ నెల 8న అనంతపురంలోని సర్వజనాస్పత్రికి కుమారుడు శ్రీనివాసులు పిలుచుకొచ్చాడు. పరీక్షించిన వైద్యులు ఆమె గుండె రక్తనాళాల్లో బ్లాక్ ఏర్పడిందని, శస్త్రచికిత్స అవసరమని గుర్తించి, ఈ నెల 11న ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. కార్డియాలజిస్టు డాక్టర్ సుభాష్‌చంద్రబోస్ నేతృత్వంలో ఈ నెల 13న ఆమెకు శస్త్రచికిత్స చేసి స్టంట్ వేశారు. ప్రధాన నగరాల్లో ఇదే శస్త్ర చికిత్సకు రూ.3 లక్షల వరకు ఖర్చవుతుంది. అయితే నయా పైసా చెల్లించకుండానే బయమ్మకు వైద్యులు శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు.



ఇతని పేరు ఎస్.అన్వర్ బాషా. గుమ్మఘట్ట గ్రామం. గుండె సంబంధిత సమస్యతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరాడు. దీంతో అతని గుండె పనితీరును గుర్తించేందుకు ఓ హోల్టర్ పరికరాన్ని అమర్చి 24 గంటలూ అతని గుండె చప్పుడుని రికార్డ్ చేశారు. గుండెలో వచ్చే అబ్‌నార్మల్ రిథమ్స్ తెలుసుకునే సౌలభ్యం కేవలం ఈ ఆస్పత్రిలోనే ఉండడం గమనార్హం.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కార్డియాలజీ సేవలు ఇలా..

ఓపీ సేవల ప్రారంభం	2022, ఏప్రిల్
ఐపీ సేవల ప్రారంభం	2022, జూన్
క్యాథ్‌ల్యాబ్ సేవల ప్రారంభం	2022, డిసెంబర్ 21 నుంచి

గడిచిన 8 నెలల్లో సాధించిన పురోగతి

యాంజియోప్లాస్టీ(స్టంట్లు) శస్త్రచికిత్సలు	70
యాంజోగ్రామ్స్ చికిత్స	250

అన్ని సేవలు ఉచితమే



పేద, మధ్య తరగతి ప్రజలకు పైసా ఖర్చు లేకుండా ఖరీదైన కార్డియాక్ సేవలు సూపర్ స్పెషాలిటీలో అందుబాటులో ఉన్నాయి. ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఓపీ ఉంటుంది. మిగిలిన రోజుల్లో సమస్యను బట్టి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా తక్షణమే ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తున్నాం.
– డాక్టర్ సుభాష్‌చంద్రబోస్, కార్డియాలజీ విభాగాధిపతి

మంచి ఫలితాలు సాధిస్తున్నాం



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న అన్ని విభాగాల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. గతేడాది ఏప్రిల్ నుంచి గుండెకు సంబంధించి సేవలు మొదలయ్యాయి. ప్రభుత్వ సహకారంతో మంచి ఫలితాలు సాధిస్తున్నాం.
– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, సూపరింటెండెంట్, జీజీహెచ్

సీఎంను కలిసిన ఎమ్మెల్యే తోపుదుర్తి, నాగరాజు



రాప్తాడు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో గురువారం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఇటీవలే వైఎస్సార్‌సీపీలో చేరిన బీసీ నాయకుడు పోతుల నాగరాజు కలిశారు. రాప్తాడు నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే వివరించారు.

పారిశ్రామిక వేత్తల సహకారంతో కళాశాలల ఆధునికీకరణ

• సీడాప్ సీఈఓ శ్రీనివాసులు



మాట్లాడుతున్న శ్రీనివాసులు

అనంతపురం: జిల్లాలోని ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల ఆధునికీకరణకు సహకరించాలని పారిశ్రామికవేత్తలకు సీడాప్ సీఈఓ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పారిశ్రామిక వేత్తలు, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఆధునిక ల్యాబ్‌లు, ఆధునిక బోధనా పద్ధతులు, పరిశ్రమలలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, స్టేట్ మిషన్ మేనేజర్ విజయ, జేడీఎం సూర్యనారాయణ, డీఎస్‌డీఓలు రాజ్‌కుమార్, అబ్దుల్‌ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

సినిమా థియేటర్‌లో చోరీ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ శివ

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో ఉన్న దాదాపీర్ సినిమా థియేటర్‌లో చోరీ జరిగింది. దాదాపు రూ.4.50 లక్షల విలువైన సామగ్రిని దుండగులు అపహరించుకెళ్లారు. థియేటర్ యజమాని ఫక్రుద్దీన్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శివ అక్కడకు చేరుకుని పరిశీలించారు. కొన్ని రోజులుగా థియేటర్ బంద్‌లో ఉందని, అయితే పరికరాలు మరమ్మతుకు లోను కాకుండా అప్పుడప్పుడు కాసేపు సినిమా ఆడించేవారమని తెలిపారు. 10 రోజుల క్రితం కూడా రన్నింగ్ చేసినట్లు గుర్తుచేశారు. గురువారం ఉదయం థియేటర్‌లోకి వెళ్లి పరిశీలించగా ప్రొజెక్టర్ గదిలోని యాప్లిఫ్లయర్లు, స్క్రీన్ వెనుక ఉన్న మూడు రన్నింగ్ స్పీకర్లు, ఇతర సామగ్రి అపహరణకు గురైనట్లు తెలుసుకుని ఫిర్యాదు చేసినట్లు వివరించారు. చోరీ అయిన సామగ్రి విలువ దాదాపు రూ.4.50 లక్షలు ఉంటుందని తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జగనన్న జనరంజక పాలన

• వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



అనంతపురం క్రైం: 'గడప గడపకూ మన ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష' తదితర బృహత్తర కార్యక్రమాల ద్వారా జనరంజక పాలన సాగిస్తూ దేశంలోనే ఆదర్శవంతమైన సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖ్యాతి గడించారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాంకేతిక కారణాలతో పథకాలు అందని వారిని గుర్తించి వారికి సంక్షేమ ఫలాల లబ్ధి చేకూర్చేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గత నెలలో రాష్ట్ర వ్యాప్తంగా 1.70 లక్షల మంది వలంటీర్లు తమ క్లస్టర్ల పరిధిలో 84 లక్షల ఇళ్లలో సర్వే నిర్వహించారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం కింద ఇంటిగ్రేటెడ్, కుల, ఆదాయ ధ్రువీకరణ, ఓబీసీ, వివాహ ధ్రువీకరణ, అడంగల్, వన్‌బీ, రేషన్ కార్డులు, ఆరోగ్య శ్రీ , పట్టాదారు పాసు పుస్తకాలను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ఇదే ధ్రువీకరణ పత్రాల కోసం గత టీడీపీ హయాంలో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ప్రయోజనం ఉండేదికాదన్నారు. ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి కృషి చేస్తున్న అధికారులు, వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రగతి నివేదికలను అప్‌లోడ్ చేయాలి

• డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్



పీహెచ్‌సీ వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్

అనంతపురం క్రైం: రోగులకందించే సేవల ప్రగతి నివేదికలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ ఆదేశించారు. గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నుంచి జిల్లాలోని వివిధ పీహెచ్‌సీ వైద్యాధికారులతో ఆయన జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా గర్భిణులు, తల్లులు, రక్తహీనతతో బాధపడుతున్న వారు, మధుమేహ వ్యాధి, వ్యాధినిరోధక టీకాలు విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. అంటువ్యాధులు, వ్యాధులకు సంబంధించి చికిత్స, నివారణ సర్వేలో సోమ, మంగళ, గురువారం ఏఎస్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సమయపాలన, ఎఫ్ఆర్ఎస్‌ను పాటించాలని, లేని పక్షంలో జీతంలో కోత తప్పదన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ చెన్నకేశవులు, డాక్టర్ అనుపమ, డాక్టర్ మనోజ్, డాక్టర్ మహేంద్రనాథ్, మలేరియా అధికారి ఓబులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ ప్రక్రియ పూర్తి చేయండి

• సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు



మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు

అనంతపురం రూరల్: వసతి గృహాల్లో ప్రవేశాల ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు ఆదేశించారు. గురువారం బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సహాయ సంక్షేమ అధికారులు, వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో సమస్యలు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత వార్డెన్లు, సహాయ సంక్షేమ అధికారులపై ఉందన్నారు. విద్యార్థుల హాజరును బయోమెట్రిక్ విధానంలో తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

• హౌసింగ్ పీడీ కేశవనాయుడు



మాట్లాడుతున్న పీడీ కేశవనాయుడు


కళ్యాణదుర్గం: జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను హౌసింగ్ పీడీ కేశవనాయుడు ఆదేశించారు. కళ్యాణదుర్గంలోని గూబనపల్లి లేఅవుట్‌ను డీఈ శైలజ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, ఏఈలు రామ్మోహన్, లోక్‌నాథ్ చౌదరితో కలసి గురువారం ఆయన పరిశీలించారు. థర్డ్ ఆప్షన్ కింద నిర్మిస్తున్న ఇళ్ల నాణ్యతను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం హౌసింగ్ కార్యాలయంలో ఉద్యోగులు, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. లబ్ధిదారులకు అవసరమైన మెటీరియల్‌ను సకాలంలో అందించాలన్నారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడకూడదన్నారు.

రెండు తలలతో గొర్రె పిల్ల జననం



బొమ్మనహాళ్: మండలంలోని బొల్లనగుడ్డంలో గొర్రెల కాపరి గుండమ్మగారి తిమ్మప్పకు చెందిన ఓ గొర్రె గురువారం సాయంత్రం రెండు తలలు ఉన్న పిల్లకు జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని పరిశీలించారు. పుట్టిన గొర్రె పిల్ల ఆరోగ్యంగా ఉన్నట్లు కాపరి తిమ్మప్ప తెలిపారు. విషయం తెలుసుకున్న పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. జన్యు పరమైన లోపాల కారణంగా ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటాయన్నారు. చాలా కేసుల్లో పుట్టిన వెంటనే మరణిస్తుంటాయని, అయితే ఇందుకు విరుద్ధంగా రెండు తలలతో జన్మించిన గొర్రె పిల్ల ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిసిందన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



సోమనాథ్ (ఫైల్)

ఉరవకొండ: స్థానిక వడ్డే వీధికి చెందిన ఉప్పర సోమనాథ్ (38) గురువారం రాప్తాడు సమీపంలోని ప్రసన్నాయపల్లి రైల్వే గేటు వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉరవకొండ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల ధర్మవరం నుంచి గుత్తికి బదిలీపై వెళ్లిన ఆయన డిప్యూటేషన్‌పై ఉరవకొండలో విధులు నిర్వర్తిస్తున్నాడు. సోమనాథ్‌కు భార్య భాగ్యలక్ష్మి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

బాలిక అదృశ్యం



ప్రియదర్శిని

పుట్టపర్తి టౌన్: మండలంలోని కంబాలపర్తికి చెందిన శ్రీనివాసులు కుమార్తె ప్రియదర్శిని (16) కనిపించడం లేదు. ఈ మేరకు తండ్రి ఫిర్యాదు చేసినట్లు కొత్తచెరువు ఎస్‌ఐ లింగన్న తెలిపారు. అనంతపురంలోని వివేకానంద కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రియదర్శిని ఈ నెల 7న సెలవులకు స్వగ్రామానికి చేరుకుంది. ఈ నెల 19న అనంతపురానికి వెళ్లేందుకు ఉదయం 10 గంటలకు కొత్తచెరువు బస్టాఫ్ వద్దకు చేరుకుంది. ఆ సమయంలో కుమార్తెకు అవసరమైన మందులు కొనేందుకు తండ్రి శ్రీనివాసులు పక్కనే ఉన్న మెడికల్ స్టోర్‌కు వెళ్లారు. తిరిగి బస్టాఫ్ వద్దకు చేరుకునే సరికి బాలిక కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాలు గాలించినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96838కు సమాచారం అందించాలని కోరారు.

భార్య కనిపించడంలేదని ఫిర్యాదు

బత్తలపల్లి: గత మూడు రోజులుగా తన భార్య కనిపించడం లేదని పోలీసులకు ఓ భర్త ఫిర్యాదు చేశాడు. వివరాలు.. బత్తలపల్లిలో వాటర్ సర్వీసు సెంటర్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న షేక్ అబ్దుల్ ఖాదర్‌కు అనంతపురం జిల్లా తరిమెలకు చెందిన షేక్షావలి రెండో కుమార్తె సల్మాతో ఈ నెల 6న వివాహమైంది. ఈ కొన్ని రోజులూ ఇద్దరూ అన్యోన్యంగానే ఉన్నారు. గత సోమవారం మధ్యాహ్నం అబ్దుల్ ఖాదర్ మసీదుకు వెళ్లి ఇంటికి చేరుకున్న సమయానికి భార్య కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువులను ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గురువారం ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జూనియర్ ఇంటర్ టాపర్లకు 23న 'మాస్టర్ మైండ్స్' సన్మానం

రాప్తాడు రూరల్: అనంతపురం నగరంలోని వివిధ కళాశాలల్లో చదివి, 2022–23 విద్యా సంవత్సరం జూనియర్ ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను మాస్టర్స్ మైండ్స్ విద్యా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23న సన్మానం చేయనున్నారు. స్థానిక లలితా కళాపరిషత్‌లో సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని ఆ విద్యా సంస్థ అడ్మిన్ అడ్వయిజర్ మట్టుపల్లి మోహన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్టేట్ సిలబస్ ఎంపీసీ విభాగంలో 430 – ఆపై మార్కులు సాధించిన వారు అర్హులు. అలాగే బైపీసీలో 400–ఆపై, ఎంఈసీలో 470–ఆపై, సీఈసీలో 450–ఆపై మార్కులు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందజేయనున్నారు. పూర్తి సమాచారానికి 92487 22281, 77803 90139 నంబర్లలో సంప్రదించవచ్చు.

క్లుప్తంగా

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాప్తాడు: విద్యార్థులందరికీ చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమేనని విశ్రాంత ఉద్యోగి కృష్ణమూర్తి అన్నారు. తన మనుమరాలు తన్మయ్‌శ్రీ జన్మదిన వేడుకల సందర్భంగా స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అనురాధ, పీడీ మల్లికార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు వైఎస్ జగన్ భరోసా



మత పెద్దలతో కలసి బ్రోచర్ విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే ముస్లింమైనార్టీలకు భరోసా అని నగర మేయర్ వసీం పేర్కొన్నారు. గురువారం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని ఏఎస్ ఆర్‌నగర్ మసీద్–ఎ– గని మజీద్‌లో హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్ కే సాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర మేయర్ మహమ్మద్ వసీం సలీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ హిరియల్ నదీమ్ అహ్మద్, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్ పాల్గొన్నారు. మత పెద్దలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. మేయర్ మాట్లాడుతూ నిన్నటి రోజున ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముస్లిం మత పెద్దలతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి, ప్రభుత్వం అన్ని వేళలా ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారన్నారు. తొలి నుంచి వైఎస్ కుటుంబం మైనార్టీల పక్షపాతి అని గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలు అందరూ వైఎస్సార్‌సీపీకి అండగా నిలుద్దామని కోరారు. కార్యక్రమంలో మసీద్ ఇమామ్ ఉమర్ ఫరూక్, మసీదు ముతవల్లి ఫయాజ్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు

- ఏపీ ప్రభుత్వ ఎండోమెంట్ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్



జ్వాలాపురం శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనంతపురం కల్చరల్: ఆలయాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తామని ఏపీ ఎండోమెంట్ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. గురువారం కందుకూరులోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి సాయమందించాలని ఆలయ కమిటీ సభ్యులు ఆదినారాయణ, శివయ్య, ఓబులేసు తదితరులు జ్వాలాపురం శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు. స్థానిక రామనగర్‌లోని బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడుతూ కందుకూరులో దశాబ్దాల కిందటే లక్ష్మీనరసింహస్వామి ఆలయం నిర్మాణమైందని, దానికి మాన్యం కానీ ఇతర ఆదాయమార్గమేమీలేదన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రజలు సహాయమడిగారని ధూప దీపనైవేద్యానికి ప్రతినెలా రూ.5 వేలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు రాజు, పెద్దన్న, ఓబులపతి తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ 1938లో పలువురి చేరిక



సంఘంలో చేరిన వారికి సభ్యత్వం కల్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

రాప్తాడురూరల్: జిల్లాతో పాటు అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల్లో పని చేస్తున్న పలువురు నాయకులు ఏపీటీఎఫ్ (1938)లో గురువారం చేరారు. ఈ సందర్భంగా అనంతపురంలో సమావేశం ఏర్పాటు చేశారు. సంఘంలో చేరిన వారికి సభ్యత్వం కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏపీటీఎఫ్ (1938)సిద్ధాంతాలు, పోరాటాలకు కట్టుబడి పని చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయగిరి మహమ్మద్ రఫీ, అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా సర్జికల్ బ్లాక్ నిర్మాణం



నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న ఇంజినీర్

నగరంలో సర్వజనాస్పత్రికి అనుబంధంగా రూ.300 కోట్లతో సర్జికల్ బ్లాక్‌ను నిర్మిస్తున్నారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తయితే రోగులకు అధునాతన సేవలు అందనున్నాయి. మెరుగైన చికిత్స కోసం పెద్ద పట్టణాలు, నగరాలకు వెళ్లాల్సిన పని ఉండదని ప్రజలు చర్చించుకుంటున్నారు.


– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:





శరవేగంగా జరుగుతున్న నిర్మాణ పనులు

ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ



కనగానపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా అందించేందుకు ఏర్పాటు చేసిన గ్రామ వలంటీర్లు కరోనా విపత్కర సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు అందించి శెభాష్ అనిపించుకున్నారు. కనగానపల్లిలో గ్రామ వలంటీర్ పోతలయ్య కరోనా సమయంలో బీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు దాతలు అందించిన శానిటైజర్లు, మాస్కులు పంపిణీ చేశాడు. కరోనా సోకి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధులకు అక్కడికే వెళ్లి పింఛన్ డబ్బులు అందజేసి వారిని ఆదుకున్నాడు. వలంటీర్ సేవలకు మెచ్చి అప్పటి జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడు చేతుల మీదుగా 'యోధులకు వందనం' కింద ప్రశంసా పత్రం అందజేశారు.



కనగానపల్లిలో కరోనా సమయంలో ఇంటింటికీ వెళ్లి శానిటైజర్లు, కూరగాయలు అందిస్తున్న వలంటీర్ పోతలయ్య

వలంటీర్ సేవలు మరువలేనివి



కరోనా సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలంటే జంకాల్సిన పరిస్థితి ఉండేది. అలాంటి సమయంలో మా గ్రామ వలంటీర్ పోతలయ్య మా ఇళ్ల దగ్గరకు వచ్చి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఇచ్చిన కూరగాయలు, పండ్లు, శానిటైజర్లు పంపిణీ చేశాడు. ఇలా వారి ప్రాణాలకు తెగించి మాకు సేవలు చేయటం చాలా గొప్ప విషయం.

- పెద్దన్న, బీసీ కాలనీ, కనగానపల్లి

'జగనన్న సురక్ష'తో ప్రజాసంక్షేమం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం నగరంలోని యువజన కాలనీ, హమాలీ కాలనీల్లో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కుల, ఆదాయ, రేషన్‌కార్డు, తదితర సర్టిఫికెట్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతేడాది సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని, పరిష్కరించామన్నారు. సాంకేతిక కారణాలతో అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు వర్తింపులో జాప్యం జరిగి ఉంటే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. జగనన్న సురక్ష ద్వారా కుల,ఆదాయ, జనన, మ్యారేజ్, రేషన్ కార్డు తదితర 11 రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

23 వేల మందికి ఇళ్లు:

నియోజకవర్గంలో 23 వేల మందికి ఇళ్ల పట్టాలు అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న 2,304 మందికి మరో రెండు, మూడు నెలల్లో ఇళ్లు అందించనున్నట్లు తెలిపారు. కామారుపల్లి ఇళ్ల లబ్ధిదారులకు కురుకుంట, కొడిమి, రాచానపల్లి ప్రాంతంలో స్థలాలను కేటాయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అదనపు కమిషనర్ రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, కార్పొరేటర్లు గోగుల లక్ష్మీదేవి, దుర్గాదేవి, మీనాక్షి, మల్లెమీద నరసింహులు, కమల్‌భూషణ్, రహంతుల్లా, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, సైఫుల్లాబేగ్, నాయకులు నాగార్జునరెడ్డి, బలరాం, బాలమారుతి, సతీష్, భారతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం

అనంతపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేద ప్రజలకు రక్ష అని, అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాజీవ్‌కాలనీ, ఏ నారాయణపురం పంచాయతీల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజలు,ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తున్న వలంటీర్లపై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ చంద్రకుమార్, సర్పంచ్ ఆశాబీ, ఎంపీటీసీ సంధ్య, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెల వేణుగోపాల్, హుస్సేన్, జగన్‌మోహన్‌రెడ్డి, సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాప్తాడు: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి అన్నారు. గురువారం మండలంలోని ప్రసన్నాయపల్లిలో మండల ప్రత్యేకాధికారి ఉమా మహేశ్వరమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ అర్హత ఉండి ఇంకా ప్రభుత్వ పథకాలు అందని వారి కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను తెలుసుకొని వాటిని అక్కడికక్కడే పరిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, ఏఓ వెంకటేశ్వర ప్రసాద్, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, సర్పంచు శశికల, మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు వర్తింపు

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత అర్హులందరికీ నేరుగా పథకాలు వర్తింపజేస్తున్నట్లు ఎంపీపీ హేమలత తెలిపారు.గురువారం మండల కేంద్రంలోని సచివాలయం–1 లో ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో జన్మభూమి కమిటీ వారు చెప్పిన వారికే పథకాలు అందేవని, ప్రస్తుతం అలా కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తిస్తున్నాయన్నారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రఘునాథ్‌రెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి, మండల కన్వీనర్ బాలపోతన్న, ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు శైలజ, శిరీష, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వారం రోజుల్లో రేషన్ కార్డు



గతంలో ఒకే రేషన్ కార్డులో అత్తామామ, నా భర్త సుకుమార్ ఉండేవారు. దీంతో వివిధ పథకాలకు అర్హత లేకుండా పోయింది. పెళ్లై నాలుగేళ్లయినా రేషన్‌కార్డు లేదు. హౌస్ హోల్డ్, రేషన్‌కార్డు స్ప్లిట్ అయితేనే రేషన్ కార్డు వస్తుందని, ఇంటి స్థలం, ఇతర ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని సిబ్బంది చెప్పారు. ప్రభుత్వం ఇప్పుడు అవకాశం కల్పించడంతో వారం రోజుల్లో రేషన్‌కార్డు మంజూరైంది. ఇంత త్వరగా రేషన్‌కార్డు వచ్చినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు.

– చంద్రకళ ,హౌసింగ్‌బోర్డు, అనంతపురం

అన్ని పథకాలూ వర్తిస్తున్నాయి



కొన్నేళ్లుగా జనరల్ స్టోర్ ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. పథకాలకు ఐటీ రిటర్న్స్ అడ్డంకిగా మారింది. దీంతో రేషన్‌కార్డు మంజూరు కాలేదు. అమ్మఒడి, ఇళ్లు, పింఛన్ అర్హత చూపలేదు. ఇటీవల ఆ సమస్య తొలగడంతో రేషన్‌కార్డు మంజూరైంది. రానున్న రోజుల్లో సచివాలయ సిబ్బంది అర్హతను బట్టి అన్ని పథకాలు వర్తిస్తాయని చెప్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– లత, మదన్‌మోహన్, విద్యుత్‌నగర్, అనంతపురం

పొరపాట్లులేకుండా ఓటరు జాబితా సిద్ధం

రాప్తాడు: ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా పక్కాగా సిద్ధం చేసేందుకు ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్‌ఓలు ఇంటింటా సర్వే చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ, నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి నరసింహారెడ్డి తెలిపారు.గురువారం ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు, ఇతర అంశాలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కొత్త ఓటరు జాబితాలతో ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు ప్రతి ఇంటికీ బీఎల్‌ఓలు వస్తారని, ఓటర్లు తమ పేర్లు, ఆధార్ నంబర్లు, ఇంటి పేర్లు తదితర వివరాలు జాబితాలో సరిగా ఉన్నవీ లేనిదీ సరి చూసుకోవాలన్నారు. సర్వేలో ఎలాంటి రాజకీయ ప్రమేయం ఉండకూడదన్నారు. బీఎల్‌ఓలు, సంబంధిత సూపర్‌వైజర్లు మాత్రమే సర్వే చేయాలన్నారు. వలంటీర్లు, ఎన్జీఓలు, ఇతరుల ప్రమేయం ఉండరాదని స్పష్టం చేశారు. బీఎల్‌ఓలు సర్వే చేసేటప్పుడు రాజకీయ పార్టీల ఏజెంట్లకు ముందుగా సమాచారం ఇవ్వాలని సూచించారు. బోగస్ ఓట్లు తొలగిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల విషయంలో ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వే షెడ్యూల్ రెవెన్యూ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలన్నారు. ఆరు మండలాల తహసీల్దార్లు, ఈడీటీ విజయ్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి నరసింహారెడ్డి

అరంగేట్రం కోసం అమెరికా నుంచి అనంతకు..



నాట్య గురువు అపర్ణ సుందరం వద్ద మెలకువలు నేర్చుకుంటూ..

అనంతపురంకల్చరల్: అమెరికాలో స్థిరపడిన క్రాంతి కిరణ్‌రెడ్డి కుటుంబం భారతీయ సంస్కృతీసంప్రదాయాలు మర్చిపోలేదు. పిల్లలకు కూడా వాటిని నేర్పించారు. దీంతో కిరణ్‌రెడ్డి కుమార్తెలు చిన్నప్పటి నుంచే శాస్త్రీయ నృత్యంనేర్చుకున్నారు. అనంతలో అరంగేట్రం చేసేందుకు అమెరికా (కాలిఫోర్నియా) నుంచి వస్తున్నారు. వివరాలు.. ముక్తాపురానికి చెందిన క్రాంతి కిరణ్‌రెడ్డి, రాధ దంపతులకు క్రితిరెడ్డి, ధృతి రెడ్డి సంతానం. తల్లిదండ్రులు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను తమ పిల్లలకు అలవర్చారు. భారతీయ పండుగలు, ఆచారాల గురించి పిల్లలకు నేర్పిస్తుంటారు. దీంతో చిన్నప్పటి నుంచి శాస్త్రీయ నృత్యంపై మక్కువ ఉన్న క్రితి,ధృతి ఇద్దరూ అమెరికాలోనే స్థిరపడిన బెంగళూరుకు చెందిన అపర్ణాసుందరం వద్ద శాస్త్రీయ నృత్యం నేర్చుకున్నారు. తమ తొలి ప్రదర్శన (అరంగేట్రం)ఇచ్చేందుకు అమెరికా నుంచి అనంతకు వస్తున్నారు. శుక్రవారం సాయంత్రం టీటీడీ కళ్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, నాట్యాచార్యులు సంధ్యామూర్తి హాజరుకానున్నారు. అనంతలో అరంగేట్రం తర్వాత భారత్‌లోని పెద్ద నగరాల్లో ప్రదర్శన ఇవ్వాలన్న లక్ష్యం పెట్టుకున్నట్లు క్రితి తెలిపింది.

బాధిత కుటుంబానికి పరామర్శ

రామగిరి: మండల కేంద్రంలోని హరిజన నరసింహులు (55) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం వైఎస్సార్‌సీపీ నేతలు బాబురెడ్డి , జెడ్పీటీసీ నాగార్జున తదితరులు రామగిరికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నరసింహులు లేని లోటు తీరనిదని, కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.20వేలు ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బండారు అనిల్‌కుమార్, శెట్టిముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఈ- ఆఫీస్ విధానాన్ని అమలు చేయాలి

అనంతపురం క్రైం: ఈ ఆఫీస్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు సర్వజనాస్పత్రి హెచ్‌ఓడీలను ఆదేశించారు. గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వివిధ విభాగాధిపతులతో సూపరింటెండెంట్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ కేసులను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోగుల వివరాలను ఈ ఆఫీస్‌లో నమోదు చేయాలన్నారు. తద్వారా రోగులకు అందుతున్న సేవలు, వారి ఆరోగ్య వివరాలను భద్రంగా ఉంటాయన్నారు. ప్రతి కేసునూ ఆరోగ్య శ్రీ కింద నమోదు చేయాలన్నారు. తద్వారా ఆస్పత్రికి ఆదాయ వనరులు పెరుగుతాయన్నారు. హెచ్‌ఓడీలు డాక్టర్ భీమసేనాచార్, డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ రామస్వామి, డాక్టర్ రామస్వామి నాయక్, డాక్టర్ నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీట్ల సంఖ్య పెంచాలని ధర్నా

రాప్తాడురూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో సీట్ల సంఖ్య పెంచాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అనంతపురం నగరంలో బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల డీసీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ ఈవిద్యాసంవత్సరంలో చాలామందికి సీట్లు రాలేదన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి పేద విద్యార్థికీ అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు రజిత, జిల్లా సహాయ కార్యదర్శి సూర్య ప్రకాష్, జిల్లా నాయకులు శివ, వర్ధన్ చంద్ర, రాజేష్, వినోద్, శివమ్మ, ఓంకార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్‌ఐఓ కార్యాలయం ముట్టడి

రాప్తాడురూరల్: జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతి సదుపాయాలను కల్పించాలని, ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో అనంతపురంలోని ఆర్‌ఐఓ కార్యాలయాన్ని గురువారం ముట్టడించారు. ఏబీవీపీ అనంతపురం విభాగ్ కన్వీనర్ అఖిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఐఐటీ, జేఈఈ మెయిన్స్, నీట్, ఎంసెట్ పేర్లతో కార్పొరేట్ కళాశాలలు విద్యా వ్యాపారం చేస్తున్నాయన్నారు. పుస్తకాలు అమ్ముతూ రూ.వేలు దోచుకుంటున్నారన్నారు. అనంతరం ఆర్‌ఐఓ సురేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహేష్, నగర ఉపాధ్యక్షులు భరత్, కమల్, నాయకులు శివతేశ్వర్ రెడ్డి, బాబు, సుధీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలి

అనంతపురం అర్బన్: ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ఆన్‌లైన్ బెట్టింగ్, లివింగ్, ఫ్రెండ్‌షిప్, తదితర యాప్‌లను ప్రభుత్వం నిషేధించేలా చూడాలని కలెక్టర్ ఎం.గౌతమిని ఏఐవైఎఫ్ నాయకులు కోరారు. గురువారం కలెక్టర్‌ను సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, తదితరులు కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ బెట్టింగ్ యాప్‌లతో యువత పెడదారి పడుతోందన్నారు. క్రికెట్, రమ్మీ, తదితర ఆటల్లో బెట్టింగ్‌కు పాల్పడుతూ తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మోసగాళ్లు లివింగ్ యాప్ పేరుతో యువతను ఆకర్షించి వీడియోకాల్స్ రికార్డు చేసి, ఆ తరువాత బ్లాక్‌మెయిల్ చేస్తూ ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఫ్రెండ్‌షిప్ యాప్ ద్వారా యువతను ఆకర్షించి స్నేహం పెంచుకొని, మార్ఫింగ్ ఫొటోలు పంపుతూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారన్నారు. ఇలాంటి యాప్‌లను నిషేధించి సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాము, దనుంజయ, దేవేంద్ర పాల్గొన్నారు.



కలెక్టర్ గౌతమికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళకు గాయాలు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి వద్ద ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గురువారం ఓ మహిళ గాయపడింది. వివరాలు..కూడేరు మండలం అరవకూరుకు చెందిన ఓబుళమూర్తి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఓబుళమూర్తి తన తల్లి హనుమక్కతో కలిసి అమ్మఒడి డబ్బులు డ్రా చేసేందుకు ద్విచక్రవాహనంపై అనంతపురం బయల్దేరాడు. రాచానపల్లి యూటర్న్ వద్దకు రాగానే గుర్తు తెలియని బైక్ వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పి తల్లీకొడుకు కిందపడ్డారు. హనుమక్క తలకు బలమైన గాయమైంది. వెంటనే ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బైకు ఆపకుండా వెళ్లిపోయింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆత్మకూరు: ఆత్మకూరు సమీపంలో గురువారం ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు.. అనంతపురం నుంచి వస్తున్న ఆటోను ఆత్మకూరు వద్దకు రాగానే వెనుకవైపున వస్తున్న బస్సు ఆటోను తగలడంతో బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న పంపనూరు తండాకు చెందిన ఇద్దరు మహిళలు లక్ష్మక్క, మౌనికకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై విచారిస్తున్నట్లు ఎస్‌ఐ జనార్దన్ తెలిపారు.

రచయిత శ్రీరమణకు మృతికి సంతాపం

అనంతపురం కల్చరల్: తెలుగు భాషకు గుర్తింపు తెచ్చిన వారిలో ఒకరైన రచయిత శ్రీరమణ మృతి తీరనిలోటు అని హాస్యవల్లరి ప్రతినిధి, మానవతా సంస్థ కన్వీనర్ తరిమెల రమణారెడ్డి అన్నారు. శ్రీరమణ మృతికి మానవతా సంస్థ అమరనాథరెడ్డి, కోకన్వీనర్ సలీం గురువారం సంతాపం తెలిపారు.

వైఎస్సార్ విగ్రహ ఏర్పాటును వ్యతిరేకించడం సిగ్గుచేటు

అనంతపురం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజ శేఖర రెడ్డి ప్రజానాయకుడని, ఆయన విగ్రహ ఏర్పాటును వ్యతిరేకించడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం యూనివర్సిటీ అధ్యక్షుడు రాధాకృష్ణయాదవ్ కొనియాడారు. గురువారం ఆయన యూనివర్సిటీలో విలేకరులతో మాట్లాడారు. బడుగు,బలహీనవర్గాలు నేడు ఉన్నత విద్యనభ్యసిస్తున్నారంటే అది కేవలం వైఎస్సార్ చలువే అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయలేదని, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ ప్రవేశపెట్టారన్నారు. ఉన్నత విద్యనభ్యసించేందుకు పేదరికం అడ్డంకి కారాదని, అందరూ చదువుకోవాలన్నదే ఆయన ఆశయమన్నారు. అద్భుతమైన సాంకేతిక కోర్సులు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. లక్షలాది మంది పేద విద్యార్థులను ఉన్నతస్థాయికి చేర్చిన మహనీయుడి విగ్రహాన్ని ఎస్కేయూలో ఏర్పాటు చేయడాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు.

సాకే భారతికి ఆర్డీటీ అండ



భారతిని సత్కరిస్తున్న ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్

అనంతపురం: పీహెచ్‌డీ పట్టా పొందిన సాకే భారతికి ఆర్డీటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్ భరోసా కల్పించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన స్నాతకోత్సవంలో సాకే భారతి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. కూలిపనులకు వెళ్తూ కష్టపడి చదివి డాక్టరేట్ పొందిన వైనంపై 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ స్పందించారు. గురువారం ఆర్డీటీ కార్యాలయానికి ఆమెను పిలిపించుకొని భారతితో మాట్లాడారు. ఆర్డీటీ నుంచి ఎలాంటి సాయం కావాలన్నా అందిస్తామన్నారు. కుటుంబ, జీవన భద్రతకు ఆర్డీటీ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత పాల్గొన్నారు.

ఉరివేసుకొని రైతు ఆత్మహత్య

కనగానపల్లి: చంద్రాశ్చర్లలో ఉరివేసుకొని రైతు కత్తే సూర్యనారాయణ (62) ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన మేరకు.. రైతు సూర్యనారాయణ కుటుంబానికి కనగానపల్లి, రామగిరి మండలాల పరిధిలో ఉన్న పొలాల్లో వ్యవసాయం చేయడానికి సూమారు రూ.6 లక్షల దాకా అప్పు చేశాడు. పంట దిగుబడి సరిగారాలేదు. అప్పులు తీర్చలేక ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతు కుటుంబానికి పరామర్శ :

అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్న మహిళా రైతు శ్రావణి కుటుంబాన్ని ఏపీ రైతు సంఘం నాయకులు జేవీ రమణ, మహదేవ పరామర్శించారు. పాల్గొన్నారు.